

# క్షమించు జీవనీ!

## డాక్టర్. వి. చంద్రశేఖరరావు

**నా స్వప్న ప్రపంచం మీద ఇంత నిర్లజ్జగా దాడి చెయ్యడానికి వీళ్లకేం అధికారం వుంది? వీళ్లు డాక్టర్లా? నియంతలా?**

ముప్పయి ఏళ్ల ఎడారిలో, ఆశలన్నీ వదులుకున్న తరుణంలో ఒక మహాద్భుతంలాగ జరిగిందా సంఘటన. మొదటి నెల పీరియడ్స్ ఆగిపోయినప్పుడు అనుమానమే రాలేదు. గడియారపు ముల్లులు కొరడాల్లె వెనుక నుంచి తరిమే నగర జీవితంలో మెన్సెస్ పది రోజులు అటూ ఇటూగా రావడం అతి సాధారణం. కానీ రెండో నెల, మూడో నెల కూడా రాలేదు. అప్పుడు కలిగిందొక పిసరంత ఆశ. ఈ ఆరేళ్లలో ఎన్నో ఇన్‌ఫెర్టిలిటీ క్లినిక్‌ల చుట్టూ తిరిగాను. ఏ క్లినిక్‌లో, ఏ గైనకాలజిస్టు చేతిలోంచి దయగా, కరుణగా జారిన ఏ మందు ప్రభావమో ఇది? భయం భయంగా వెళ్లాను డా. సరళ దగ్గరికి. ఆమె నన్ను పరీక్ష చేస్తున్నప్పుడు "ఈ ఒక్క కలను సఫలం చెయ్యి తండ్రీ! ఈ దీనురాలి ఈ చిన్ని కోర్కెను తీర్చు దేవా!" అంటూ దేవుణ్ని దీనంగా వేడుకున్నాను. ఆశ నిరాశల మధ్య ఎండుటాకులా కంపించిపోయాను పది నిమిషాలు. "కంగ్రాట్స్ లలితా" అన్న మాటలు మృదు మధురంగా వినిపించాయి. ఆవిడ చేతుల్ని పట్టుకుని "థాంక్యూ డాక్టర్! థాంక్యూ" అంటూ ఆనందంతో పెద్దగా ఏడ్చిన సంగతి, "డోంట్ బి ఎమోషనల్" అంటూనే ఆవిడా నా ఆనందంలో పాలుపంచుకోవడం, ఇదంతా జరిగి ఇంకా మూడు నెలలు కూడా కాలేదు. ఇంతలోనే పిడుగుపాటు లాంటి ఈ నిర్ణయం. వారం రోజుల క్రితం "ఫీటల్ గ్రోత్ సరిగాలేదు. స్కానింగ్ రిపోర్టు ఫేవరబుల్‌గా లేదు. ఏమ్నియోసెంటసిస్ చేయిద్దాం" అంది. ఆ పరీక్షా చేయించి


రిపోర్టు ఇస్తే ఇదిగో ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు.

"సారీ! మిసెస్‌లలితా మీకు ఎలా చెప్పాలో తెలియడంలేదు. ఆలస్యంగా గర్భవతులయ్యే స్త్రీలలో చాలా అరుదుగా జరుగుతుందిలా. దీన్ని 'డోన్ సిండ్రోమ్' అంటారు. పుట్టబోయే పిల్లలు మెదడు పెరగక ఇంబెసైల్స్‌గా వుంటారు. వికృతమైన రూపు రేఖలు, ఒక్కోసారి గుండెలాంటి ముఖ్య అవయవాలు తేడాగా పుట్టడం జరుగుతుంది. ఈ పిల్లలు తల్లికే కాదు ప్రపంచానికి కూడా బరువు. మీరు పొందే ఆశాభంగాన్ని నేను అర్థం చేసుకోగలను. కానీ డెలివరీ అయిన తరువాత మీరు పడబోయే భయంకరమైన యాతనను తప్పించడానికే ఈ నిర్ణయం తీసుకున్నాము. సీనియర్ డాక్టర్లు కూడా ఈ సలహానే ఇచ్చారు. 'వుయ్ వాంట్ టు ఎబార్ట్ ది ఫీటస్!' ఏ ఉద్రేకం లేకుండా ఎంతో కాజువల్‌గా చెప్పిందా మాటలు డాక్టర్ సరళ. ఎంత నిర్దయ? అమృతభాండాన్ని చేతిలో పెట్టినట్లే పెట్టి అంతలోనే వెనక్కు లాక్కోవడం. ఎంతో నిబ్బరంగా, ప్రశాంతంగా పడుకొని వుంటాడు లోపల. వాడి తల్లి గర్భాన్నే వాడికి సమాధి చేస్తారా?

అంతా సిద్ధం చేశారు. అవసరమైన కాగితాలపై ఆయన సంతకం కూడా చేశారు. నోరు తెరవకుండానే, పెదవులు కదపకుండానే వాడు 'అమ్మా' అని పిలిచినట్లు అనిపిస్తూంది. "అమ్మా! నన్ను చంపేస్తారా? నేను నీకు వద్దా?" అని అడుగుతున్నట్టుగా వుంది. ఇంజక్షన్లు, సిరంజ్‌లు వున్న మందుల ట్రేని తెచ్చి నా గదిలో పెట్టింది నర్సు. "ఇంకో పదినిమిషాల్లో థియేటర్ రెడీ అవుతుంది" అని చెప్పి వెళ్లింది. అంటే ఇంకో పది నిమిషాల్లో అయిదు నెలల పాటు నేను అనుభవించిన తీయని కలలు హాస్పిటల్ సాక్షిగా ఉరితీయబడతాయి. మళ్లీ ఎప్పటిలాగే ఎడారిలా ఎండిపోయి వాడిపోయి బతకాలి. సీనియర్ గైనకాలజిస్టుతో సహా డాక్టర్ సరళ గదిలోకి వచ్చింది. సిరంజ్ లోడ్ చేస్తూంది నర్సు. 'అయితే నేం?' మనసులో ప్రతిఘటన. 'వాడు ఎబ్‌నార్మల్‌గా పుడితేనేం? బిడ్డలు లేకపోవడం కంటే ఎవడో ఒకడు' ఒక నిర్ణయానికి వచ్చాను. జబ్బలోకి పదునైన నీడిల్ దిగి ఎర్రని ద్రవం నిర్దయగా నా లోపలికి ప్రవహించే లోపల "నో! వీల్లేదు. ఈ అబార్షన్ నాకిష్టం లేదు" అని అరిచాను. రెండు చేతులు జోడించి డాక్టర్ వైపు తిరిగి "ప్లీజ్ డాక్టర్? నా బిడ్డను చంపకండి!" అంటూ వేడుకున్నాను. దుఃఖపు తెర తుపానులా బయటకు తోసుకువచ్చి చాలాసేపు పొగిలి పొగిలి ఏడ్చాను. "షి ఈజ్ మెంటల్లీ వీక్! రేపు చేద్దాం!" సరళ నా భర్తతో చెబుతూంది. "నో! రేపు కాదు. మరెప్పుడూ జరుగదు. మై చైల్డ్ విల్ నాట్ డై ఇన్ మై ఊంబ్" పెద్దగా అరిచాను. నిట్టూరుస్తూ బయటకు వెళ్లిపోయింది డాక్టర్.

లేబర్ రూము నుంచి స్ట్రెచర్ సాయంతో వార్డుకు తరలిస్తున్నారు నన్ను. ఉదయం తొమ్మిది గంటల సమయం అది. వెచ్చని సూర్యకిరణం జాలిగా చెంపల్ని నిమురుతోంది. అప్పటికి సుదీర్ఘమైన అత్యంత బాధాకరమైన పన్నెండు గంటల ప్రసవ యాతన ముగిసి పది నిమిషాలే అవుతూంది. వార్డులో చేర్చిన పది నిమిషాలకు బిడ్డను తెచ్చి పక్కనే పండుకోబెట్టారు. పక్కన మరో ప్రాణి. ఈ ప్రపంచంలోకి వచ్చి ఇంకా పది నిమిషాలు కూడా కాలేదు. బిడ్డ స్పర్శ వెచ్చగా శరీరానికి తగులుతుంటే తగిలినంత మేరా శరీరం వీణలా మారి రాగలీనై మూర్ఛిల్లుతుంది. "ఇటీజ్ ఏ ఫిమేల్ చైల్డ్" అని డెలివరీ అయిన వెంటనే డాక్టర్ నా చెవి దగ్గర గుసగుస లాడింది. స్వర్గలోకం నుంచి నా యుటెరస్ గేటు ద్వారా భూమిలోకి షికారు కొచ్చిన దేవదూత ఆడ అయితేనేం? మగ అయితేనేం? దాన్ని దగ్గరకు జరుపుకుని రెండు చేతులతో పైనుంచి కిందకు ఆర్తితో తడిమాను గుడ్డి వాడు ప్రపంచాన్ని తమిడినట్లు. తల పైకెత్తి దాని ముఖంలోకి చూశాను. నిద్ర నటిస్తూంది. కనురెప్పల తలుపుల చాటున ఏ తీయని కలలు దాగున్నాయో? రొమ్ములు బరువుగా, నిండుగా లోపల మహా సముద్రాలు ఉరకలేస్తున్నట్లుగా వున్నాయి. అది పెదవులు తెరిచి 'ఆ' అంటే చాలు నోట్లోకి విరుచుకుపడాలని చూస్తున్నాయి పాలు. గంట అయినాక నర్సు వచ్చి బిడ్డను రెండు చేతుల్లోకి తీసుకుని, రొమ్ముల మధ్య దాని పెదాలు ఇరికించింది. పెదవుల మధ్య ధారగా, రోదనగా పాలు కారిపోతున్నాయే కానీ అది తాగడం లేదు. 'సుదీర్ఘమైన విషాద కావ్యానికి ఇది నాంది మాత్రమే!' అన్నట్టుగా నా వైపు చూసింది డాక్టరు. "సకింగ్ రిఫ్లెక్స్" రాలేదు. ఇలాంటి పాపల్లో చాలా ఆలస్యంగా వస్తుంది. స్పూన్‌తో ట్రై చెయ్యండి. అదీ కుదరకపోతే సెలైన్ డ్రిప్ పెడతాను" డాక్టరు సలహా ఇచ్చి వెళ్లిపోయింది. రెండు గంటల ప్రయత్నం తరువాత కొద్దిగా పాలు తాపగలిగాము. తాగి మళ్లీ నిద్రలోకి జారుకుంది. ఉక్క బెట్టే పగటి ఎండ. ఎంతకీ నిద్రలేవని చిన్నారి పాపతో ఆ గదిలో శాపగ్రస్తలా నిరసించి నేను ముఖం చూపలేదు అత్తగారు, ఆడబిడ్డ. హాస్పటల్‌లోనే వుంటూ ముఖం చాటేసాడు నా భర్త.

మధ్యాహ్నం వేళ కారేజితో అన్నం, ఫ్లాస్కులో కాఫీ తీసుకువచ్చారు ఆయన. పాపను ఎత్తుకుని ముద్దు చేస్తాడని ఎంతో ఆశపడ్డాను. సాయంత్రం కనిపిస్తాను అంటూ ఒక మాట చెప్పి వెళ్లిపోయాడు. నోటికి అన్నం సహించలేదు. కాఫీ తాగి పడుకున్నాను. ఆ సాయంత్రమే డిశ్చార్జి చెయ్యమని డాక్టర్ని అడిగాను. ఎన్నెన్నో ప్రికాషన్స్‌తో ఇంటికి పంపింది డాక్టరు. హాస్పిటల్ నుండి బయటకు నేను వేసే ఒక్కో అడుగు నాలో మొండితనాన్ని, పట్టుదలను పెంచి, లక్ష్యం కొరకు జీవించే సైనికురాలిలా ఇంటికి చేరాను.



## మారాజు బావురుమన్నాడు!

ఇవాళ పొద్దున
మిరపతోట ఆవలి గట్టు మలుపు మీద
సరిహద్దురాయి సింహాసనం మీద
గడ్డాన్ని కుడిచేతి పిడికిలి మీద ఆనించి
నా మారాజు ఆలోచనామగ్నుడై కూచున్నాడు
పైరగాలిలో జపాను తుమ్మకొమ్మ
వింజామర వీస్తోంది
లే ఎండలో తలకు దట్టంగాచుట్టుకున్న
ముతకకండువా కిరీటం మెరుస్తోంది;
కళ్ళముందు మిరపచేలో
ఆకుపచ్చ యూనిఫాం వేసుకొని
ఎర్రబుల్లెట్ల గుత్తులు వేలాడ దీసుకొని
బారులుగా నిలబడ్డ పొట్టి సైనికులు
శాల్యూట్ చేస్తున్నారు
పైన పరుగులు తీసే పాలపిట్టలు
అటూ ఇటూ మంగళ ధ్వానాలు చేస్తున్నాయి
నా మారాజు మారాజులా కూచున్నాడు
ఆలోచనల మౌన నయనాలతో చూస్తూ
అమ్మపొలం వేపు ప్రశ్నార్థకంగా చూస్తూ -
ముందటేడు బస్తీ అల్లుడు భార్యతో వచ్చి
తన స్టేటస్ అంతంత మాత్రమని అఘోరిస్తే
చేలో ఫెర్గూసన్ ట్రాక్టర్ డబ్బై, అల్లుడి యింటిముందు
స్కూటరై, ఇంట్లో టీ.వీ. అయి, ఫ్రిజ్జై, వి.సీ.పీ. అయింది.
ఆనాడు - అల్లుడి అంతరంగపు స్టేటస్ చూచి
తను నవ్వుకున్నాడే తప్ప - దుఃఖ పడలేదు.
నిరుడు
కొడుకు కోరిక బళ్ళారి పరుగెత్తి
శ్రమ పత్తిగా విప్పారి
అదృష్టం అప్పుగా మితిమీరి
అభిమానం కంటె ఆత్మహత్య చిన్నదని
పురుగుల మందు పురుగులకే కాదు
నిస్సహాయ నిర్భాగ్యులకూ పని చేస్తుందని,
కట్టలు తేవలసిన కొడుకు
కట్టగా కట్టబడి యింటికి చేరి
కట్టెలలో కర్పూరమైనప్పుడు కూడా
తను దుఃఖపడ్డాడే తప్ప - కన్నీరు పెట్టలేదు.
నిన్న
'ఏందయ్యా! ఎరువుల రేటు పెంచారు
ఎవసాయం ఎట్టా సేయమంటారు?'
అడిగిన తనమీద, తన నీడల మీద
తు పాకీ గుళ్ళు దూసుకుపోతే
అడగడానికి హక్కులేని సొరాజ్జెం ఎందుకని
అమ్మనేలని అమాయకంగా ప్రశ్నిస్తూ
బావుర 'ని ఏడ్చాడు - నా మారాజు

- నాగభైరవ కోటేశ్వరావు

."మాడు! ఈ పిల్లను మనం పెంచలేం! ఇలాంటి పిల్లల్ని పెంచడానికి బెంగుళూరులో ఇన్‌స్టిట్యూట్ వుందట. దీన్ని అక్కడ చేర్చి నెలకు ఇంతని పంపిద్దాం. అసలీ పిల్ల ముఖం చూడాలంటేనే భయంగా వుంది. వాట్ ఎ డెవిలిష్ ఫేస్! బ్రతికుందో చచ్చిందో తెలియనట్లు ఎప్పుడూ నిద్రపోతుంది. దీన్ని చూస్తే ఇది నా బిడ్డ అనే ఫీలింగ్ కలగడంలేదు. దీన్ని భరించటం మన వల్ల కాదు. లెట్ అజ్ డిస్పోజ్ ఇట్!" ఇంకా ఏదో చెప్పబోయి నా కళ్లలోని ఎరుపు చూసి ఆగిపోయాడు ఆయన. నా కళ్లలో అంత తిరస్కారం, ద్వేషం, కోపం ఎప్పుడూ చూసి వుండడు. "ఇంకోసారి నా దగ్గర ఇలాంటి వాగుడు వాగితే నాలో రాక్షసిని చూస్తావు నువ్వు! ఇది నా ప్రాణం! నా సర్వస్వం! ఇది నా దగ్గరే నాతోనే వుంటుంది. నా సర్వశక్తుల్నీ ధారబోసి దాన్ని పెంచుకుంటాను. దానిది డెవిలిష్ ఫేసా? ఎప్పుడైనా నీ ముఖాన్ని అద్దంలో చూసుకున్నావా? చూసుకుని వుంటే ఆ మాటలు అనేవాడివి కావు. నాకో ఉద్యోగం వుంది. నీ పోషణ, దయ నాకవసరం లేదు" అంత కోపంగా ఎలా మాట్లాడగలిగానో నాకే తెలియదు. శక్తి ఆవహించిన దానిలా మాట్లాడాను. ఆ తరువాత ఆయన ఆ ప్రసక్తి తేలేదు కానీ, పాప దగ్గరకు రావడమే మానేశాడు.

రెండు నెలల తరువాత ఒక ఉదయం మా వీధిలో 'దొమ్మరి ఆట' జరిగింది. తల్లీ, తండ్రీ, కూతురు. ముగ్గురు కలిసి నమ్మ నమ్మకపో శీర్షికలో రాయదగ్గ ఫీట్సు చేస్తున్నారు. మురికి మురికిగా ఎలుగ్గొడ్డులా వున్నాడు తండ్రి. వాడు డప్పు వాయిస్తూ 'జయమ్ము నిశ్చయమ్మురా! భయమ్ము లేదురా' అంటూ పాడుతున్నాడు. చింపిరి జుట్టు మాసిన చీర, వీధుల పాలైన రాజ కుమార్తెలా వుంది తల్లి. ఆవిడ హార్మోనియం వాయిస్తూంది. అద్భుతాలన్నీ కూతురే చేస్తూంది. రెండేళ్లయినా వుంటాయో లేవో? పొడవైన గొను వేసుకుని వుంది. ఎవరో దానం చేసి చేసి వుంటారు. గౌను దాని పాదాల్ని దాటి నేలపై జీరాడుతూంది. ఆ గెటప్‌లో అది గమ్మత్తుగా బుల్లి మాంత్రికురాల్లా వుంది. జనం మూగి, పాట ఆగిన తరుణంలో ఆ పిల్ల పొడవాటి కత్తిని నోట్లో దోపుకుని, గొంతులోకి, ఆ పైన పొట్టలోకి తోసింది. ఆశ్చర్యం! భయం! విస్మయం! ఒక నిమిషం ఆగి కత్తిని భద్రంగా పైకి లాగింది. కత్తి అంచుపై జిగట జిగటగా మెరుస్తూ మ్యూకస్ పొరల తడి. తరువాత రెండు బొంగుల మధ్య వేలాడదీసిన తీగలపై అటూ ఇటూ షికార్లు చేసింది. బుగ్గల్లో కిరసనాయిల్ దాచుకుని నోట్లోంచి నిప్పులు ఊదింది. ఇంత చిన్నపాప ఇన్ని అద్భుతాలు ఎలా చేయగలిగింది? శిక్షణ, తపస్సు లాంటి పట్టుదల - అన్నిటికంటే ముఖ్యంగా అవసరం. నాకో మెసేజ్ ఇవ్వడానికే ఆ ఉదయం రోడ్డుపై అవతరించిన బాలమెస్సయాలా తోచిందా పాప. కష్టపడి నేర్పితే ఆ పాప అద్భుతాల్ని చేస్తూంది. అదే దీక్ష,పట్టుదల చూపితే నా మెంటల్ రిటార్డెడ్ పాపకి మామూలు జీవితానికి అవసరమైన ఏక్టివిటీస్ నేర్పలేనా? ఫీట్సు అయిపోయి ఇంటింటికి తిరిగి "పైసలు దానం చెయ్యి తల్లీ!" అంటూ అడుక్కుంటూందా పాప. నా దగ్గరకు వచ్చినప్పుడు చేతిలో పది రూపాయల నోటు పెట్టి "నీ పేరేంటి?" అన్నాను."జీవమ్మండీ!" అంది. చిరునవ్వుతో "థాంక్యూ జీవనీ సీనియర్" అన్నాను. అర్థంకాని కళ్లతో నన్ను చూస్తూ వెళ్లిపోయిందా పాప. ఆ పేరు నాకూ ఇష్టమే అన్నట్లుగా లోపల జీవని జూనియర్ 'కేర్ కేర్' మని ఏడుస్తుంది.

"మీరేనా ఈ పాప తల్లి! ఐ సీ! చూడండి యిలాంటి పాపలు..." అవకాశం దొరికితే చాలు పెద్ద లెక్చరు ఇవ్వందే వదలరు డాక్టర్లు, చాటుగా తప్పుచేస్తున్న పిల్లల్ని మందలిస్తున్నట్టుగా. నాకు ఒళ్ళు మండిపోతుంది. యస్! అది మెంటల్లీ రిటార్డెడ్

చైల్డ్. అదేం అంటువ్యాధి కాదే. "ఆకలేస్తే ఏడవ లేరీ పాపలు. మీరే రెండు గంటలకొకసారి బల వంతంగానైనా ఫీడింగ్ యివ్వాలి. ఏ చిన్న ప్రాబ్లమ్ వచ్చినా వెంటనే డాక్టర్ని కలవండి. ఇలాంటి పాపల్ని పెంచాలంటే ఎంతో సహనం, ఓర్పు కావాలి" సానుభూతిగా నావైపు చూస్తూ చెప్పాడు డాక్టరు. రెండు రోజులుగా ఆగని డయేరియా ట్రీట్‌మెంటు కోసం ఆయన దగ్గరకు వెళ్లాను. ఇదీ వరస. ఈ సానుభూతి అంటే నాకు కోపం. ఈ సానుభూతి మీరు నాకంటే తక్కువ వాళ్ళు అనే అహంభావాన్ని సూచిస్తుంది. ఈ సానుభూతితో ఎదుటివాణ్ణి శిక్ష లేకుండా హత్య చేసిన ఆనందాన్ని పొందవచ్చు. రోజుకోసారైనా ఇలాంటి 'ఎపిసోడ్స్' తప్పవు నాకు. ఇంటా బయట ఇదే ప్రహసనం. ఒకసారి నా చిన్ననాటి స్నేహితు రాలు రాధిక వచ్చింది. అది ఎక్కడో మారుమూల ప్రాంతంలో పి.హెచ్.సి.లో డాక్టరుగా పనిచేస్తోంది. కబుర్లు చెప్పుకోవడం అయ్యాక జీవనిని ఒళ్ళోకి తీసుకొని లాలిస్తూ, అంతలోనే దాని డాక్టరు బుద్ధి పోనిచ్చుకోక "లలితా! ఎక్కడ పడతావే ఈ యాతన? ఎన్నాళ్ళిలా. పెద్దయినాక కూడా దీనికి నువ్వే ముడ్డి కడగాలి. నువ్వే స్నానం చేయించాలి. నెత్తిమీద బండరాయి బరువులా జీవితమంతా దీన్ని మోస్తూనే వుండాలి. ఎందుకొచ్చిన రొస్టు! ఏ అనాధ శరణాలయంలోనో వదిలేయరాదూ! వాళ్ళే తంటాలు పడతారు" గాజు కుండీలో పూలు సర్దు తున్నానప్పుడు. చిన్ననాటి నేస్తాన్ని చూసిన ఆనందంలో మైమరచిన నాకు ఆ మాటలు అశుద్ధాన్ని తిన్నట్టుగా అనిపించాయి. చేతిలోని ఫ్లవర్ వాజ్ జారి కిందపడింది. నేల మీద అటూ ఇటూ గాజు ముక్కలు. విసురుగా జీవనిని దాని ఒళ్ళోంచి లాక్కుని "సంస్కారపు వెలుగులేని చీకటి గుహల్లాంటి మొగుళ్ళని జీవితమంతా భరి స్తున్నాం! వాళ్ళకి పనిమనుషుల్లా, రాత్రి వేళల్లో వేశ్యల్లా గడుపుతున్నాం– నువ్వూ, నేనూ మనం దరం. ముందు నీ మొగుణ్ణి ఏదైనా రిమాండ్ హోమ్‌కి పంపు! అప్పుడు నా పాపను శరణా లయానికి పంపుతాను. ఇడియట్! ఈ సొల్లు కబుర్లు ఆపు!" నా ముఖంలోని అరుణిమకు, మాటల్లోని తీవ్రతకు బెదిరిపోయింది రాధిక. వారం రోజులు గడుపుతానని వచ్చింది. రెండో రోజే వెళ్ళిపోయింది.

వాక్సినేషన్ కోసం హాస్పిటల్‌కు వెళ్ళి వస్తు న్నాను. చంకలో జీవని. భుజంపై వేలాడే హాండ్ బాగ్. సిటీబస్సు నిండుగా వుంది. బస్సు సీటంటే అదో పార్లమెంటు సీటులా భావించే జనం. బిడ్డ తల్లి అనికూడా చూడరు. ఏ టర్నింగ్‌లోనో సడన్ బ్రేకు వేస్తే, పైట జారితే ఆబగా చూడవచ్చు అనుకొనే ఇంపొటెంట్ మగవాళ్ళ మధ్య "పాపను నాకివ్వమ్మా!" అంటూ జీవనిని అందుకొన్నాడో వృద్ధుడు. నెరిసిన జుట్టూ, కాంతివంతమైన కళ్ళూ, జ్ఞానదీపంలా ఉన్నాడాయన. విద్యానగర్ స్టేజి దగ్గర ఆయనా నాతోపాటు దిగాడు. "థాంక్స్!" అంటూ పాపను అందుకోబోతుండగా "ఇంటిదాకా ఆహ్వానించవా?" అన్నాడు నవ్వుతూ. "రండి"! అంటూ ఇంటివైపు దారితీశాను. ఆయన సుమారు రెండు గంటలపాటు ఇంట్లో ఉన్నాడు. ఆ రెండు గంటలూ జీవనితో ఆడుకుంటూనే గడిపాడు. ఎత్తుకొని లాలించి, ముద్దాడి, అర్థమయీ కాని దాని అరుపులకు రెస్పాన్స్ ఇచ్చి—జీవనిని అంత ఆప్యా యంగా స్పృశించిన వ్యక్తి నా తరువాత ఆయనే నేమో!

"అనుభవాల సిమిలారిటీ మనుషుల్ని దగ్గరకు చేరుస్తుంది. ఈ క్షణం నువ్వు నాకెంతో సన్నిహిత మైన దానివనిపిస్తూంది. ఎందుకంటే నువ్వు అనుభ విస్తున్నా ఎగొనీ, ఫ్రస్ట్రేషన్–ఆఫ్‌కోర్స్ ఆ తెగింపు అన్నీ తు.చా. తప్పకుండా ఒకప్పుడు నేనూ, ఐ మీన్ మేము, నేనూ, నా భార్యా అనుభవించాము. జీవని లాంటి పాపలకు ఈ ప్రపంచంలో కొదవ లేదు. మీలాంటి తల్లులే అరుదు. వెల్, మేము కూడా ఒక జీవని పాపకు జన్మనిచ్చి, తన కోసం ఆరాటపడి, ప్రయాసపడి పెంచాము. తలచు కుంటే అదో సాహసోపేతమైన కథలా వుంటుంది.

ఇప్పటికి సరిగ్గా ఇరవై యేళ్ళ క్రితం. అప్పటికి ఈ సైకియా ట్రిక్ రిహేబిలిటేషన్ అవీ ఇంతగా డెవలప్ కాలేదు. పాప మా ప్రపంచంలోకి వచ్చిన తరువాత లిటరల్లీ మేము సోషల్ అవుట్ కాస్ట్ అయ్యాము. మమ్మల్నెవరూ పార్టీలకూ, ఫంక్షన్లకూ పిలిచేవాళ్ళు కాదు. మేమూ ఎవర్నీ పిలిచేవాళ్ళం కాదు.

"దేశ విదేశాల్లో వున్న డాక్టర్లతో కరస్పాండెన్స్ చేశాము. ఫ్రాయిడ్, జంగ్, ఎడ్లర్, ఎరిక్ బెర్న్ వ్రాసిన సైకాలజీ పుస్తకాలన్నీ చదివాము. బిహే వియర్ థెరపీ నుంచి టి.ఎ. టెక్నిక్స్ వరకూ అన్నీ ఎడాప్ట్ చేశాము. మోడరన్ మెడిసిన్ కాకుండా దేశీయమైన వైద్య విధానాల్లో ఏదైనా ట్రీట్‌మెంట్ వుంటుందేమో అని ట్రై చేశాము. హోమియో పతి, ఆయుర్వేదంలో ఎక్స్‌పర్ట్స్ అయ్యాము. బెరటా-కార్బ్, సల్ఫర్, కాల్కేరియా, హోమియో పతి మందులు మా పాపకు కంఠతా వచ్చు. కొన్ని రోజులు 'ఎన్‌సెపబాల్' టాబ్లెట్లు వాడాము. వైద్య శాస్త్రం వాళ్ళని డిసేబుల్ పేషెంట్లుగా ముద్రవేసి లాబ్స్‌లో వస్తువుల్లా పడి వుండమని చెబుతుంది. అవసరం లేదు. వాళ్ళూ మామూలు మనుషులుగా బ్రతకగలరని నిరూపించాలని మా ఆరాటం.

మా పాప, ప్రమోదిని దానిపేరు, దాన్ని ఒక సైనికురాలిలా పెంచాము. ఐదేళ్ళకే స్కూలుకు పంపాము. అక్కడ వెక్కిరింతలు, అవహేళనలు అన్నీ మాకు తెలుసు. అయినా అది రెస్పెక్ట్ కావాలని మా తపన. మాతోపాటు మార్కెట్టుకు, థియే టర్లకు తీసుకెళ్ళేవాళ్ళం. వందలాది కళ్ళు అప హాస్యంగానో, జాలిగానో దానివైపు చూసేవి. ఇంటికి వచ్చిన తరువాత దానికి ఫీడ్‌బాక్ ఇచ్చే వాళ్ళం. దానికి 'మెనార్క్' వచ్చిం తరువాత మా సమస్యలు రెట్టింపయినాయి. మెన్సెస్ గురించి, వయసు తెచ్చే మార్పుల గురించి వివరించడానికి ఎంతో కష్టపడ్డాము. అయితే, మా శ్రమలకు రివార్డు అన్నట్లుగా అది పదహారేళ్ళకే పదవ తరగతి పాసయింది. దట్ ఈజ్ ఏన్ ఎచీవ్‌మెంట్."

అప్పటిదాక ఎంతో ఉద్వేగంతో చెబుతున్న ఆయన హఠాత్తుగా ఆపివేశాడు. క్షణం సేపు ఆయన గంభీరంగా అయిపోయారు. మోకాళ్ళపై తల ఆన్చి కూర్చున్నాడు. గాఢమైన ఆలోచనలో నిమగ్ను డయ్యాడనుకున్నాను. కానీ వినపడీ వినపడని రోదన. గాడ్! ఆయన్నెలా ఓదార్చాలో అర్థం కాలేదు. రెండు నిమిషాలయిన తరువాత "క్షమించమ్మా! లోపలి ఎగిసే దుఃఖాన్ని తట్టుకో లేకపోయాను. ఎంతయినా తండ్రిని కదమ్మా!" సంజాయిషీ చెప్పుకొన్నాడు. వాలో చిత్రమైన టెన్షన్. అద్భుతమైన కలలాంటి ప్రమోదిని జీవితం ఎందుకు విషాదంగా అయ్యిందో తెలుసు కోవాలి.



"ప్రమోదిని ఇరవైయేళ్ళకు సర్వాంగసుందరమైన స్త్రీమూర్తిగా అవతరించింది. మెంటలీ రిటార్డెడ్ అంటూ డాక్టర్లు ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించమని సలహా ఇవ్వబడ్డ ప్రమోదినేనా అనిపించింది. ప్రమోదినికి ఒక తోడు వెతకాలనుకున్నాము. రమేశ్ అని మా బంధువుల్లోనే ఒక కుర్రాడు డిగ్రీ పూర్తిచేసి ఖాళీగా ఉన్నాడు. అతన్ని చేరదీసి ఉద్యోగం ఇప్పించి ప్రమోదినికిచ్చి పెళ్ళిచేశాము. కృతజ్ఞతతో కనురెప్పలా కాపాడుతాడని అను కొన్నాము. కానీ కాలనాగులా కాటు వేశాడు. ప్రమోదినిలాంటి స్త్రీని ప్రేమించడానికి హృదయం కావాలి. సానుభూతి కావాలి. భగవంతుడు కూడా నిర్లక్ష్యం చేసినవాళ్ళను పసిపాపకంటె సుకుమారంగా చూసుకోవాలి. రమేశ్ సగటు యువకుడు. అతను కలలు కన్న డ్రీమ్‌గర్ల్ ప్రమోదినిలో కని పించక పక్కదారులను వెతుక్కున్నాడు. చౌకబారు స్త్రీలతో తన సరదాలను తీర్చుకొనేవాడు. తాగి ఇంటికి వచ్చి ప్రమోదినిని మానసికంగా, శారీరకంగా హింసించేవాడు.

వారం వారం వాళ్ళ ఇంటికి వెడుతున్నా ఈ మార్పుల్ని గమనించలేని గుడ్డివాళ్ళమయ్యాము మేము. అతనిమీద మేము పెంచుకొన్న నమ్మకం అలాంటిది. విషయాలు మాకు తెలిసేసరికి బాగా ఆలస్యమయింది. ప్రమోదినిలో మానసిక వ్యాధి లక్షణాలు బాగా పెరిగాయి. ప్రపంచం నుండి పూర్తిగా విత్‌డ్రా అయిపోయింది. ప్రేమకు, పిలుపుకు ప్రతిస్పందించని పరిస్థితి అది. తిండి తిప్పలు మానివేసి ఒంటరిగా గదిలో కూర్చుని శూన్యంలోకి చూస్తూ వుంటుంది. ఎవరో ఒకరు స్నానం చేయించాలి. తిండి తినిపించాలి. లేకపోతే అలాగే వుంటుంది. ఇప్పుడు ప్రమోదిని మెంటల్ హాస్పిటల్‌లో వుంది. లక్ష్యం, గమ్యం లేని పిచ్చివాళ్ళలా నేనూ నా భార్యా హాస్పిటల్ చుట్టూ ఆత్మలేని దేహాల్లా తిరుగు తున్నాము."

ఉద్వేగం, ఆనందం, కోపం, బాధ అన్నీ అనుభూతులూ ఒకేసారి నన్ను చుట్టుముట్టాయి. కొన్ని నిమిషాలపాటు మా యిద్దరి మధ్య మౌనం. ముందుగా ఆయనే తేరుకుని "వెల్, జీవితమింతే. కాస్త వెలుగూ, కాస్త చీకటి, అన్నట్టు నాపేరు విశ్వ నాథన్. తెలుగువాణ్ణే. ఒక ప్రైవేటు స్కూలు నడుపుతున్నాను. జీవని ఆత్మీయుల లిస్టులో నన్ను కూడా చేర్చుకో. నా అనుభవాల్ని, గుణపాఠాన్ని కలగలిపి జీవనిని అపురూపంగా పెంచుదాం. నథింగ్ టు వర్రీ!"

విశ్వనాథన్‌గారి పుణ్యమా అని జీవనిలో అనూహ్యమైన మార్పులు వచ్చాయి. ఆయన ఎన్నో సైకాలజీ పుస్తకాలు చదివారు. నిత్య జీవితంలో సైకాలజీ ఆయనకు ప్రియమైన అంశం. ఆయన హైదరాబాదులో వున్న రెండేళ్ళు మా యిల్లొక సైకాలజీ ప్రయోగశాలలా వుండేది. జీవని వ్యక్తిత్వ వికాసానికి ఆయన చేస్తున్న ప్రయోగాలు, జీవనిలో వస్తున్న మార్పులు అద్భుతమైన హ్యూమన్ డ్రామాను చూస్తున్న అనుభూతి కలిగేది. ప్రమోదినిని హాస్పిటల్ నుండి డిశ్చార్జి అయింది. ప్రమోదిని క్రమక్రమంగా నార్మల్సీకి వస్తోంది. డాక్టర్ల సలహాపై ప్రమోదినితోసహా విశ్వనాథన్ గారి కుటుంబం ఒక మారుమూల పల్లెటూరుకు తరలివెళ్ళారు. ఆయన సామీప్యం లేకపోయినా ఆయన జ్ఞాపకాలు మమ్మల్ని ఉత్తేజితం చేస్తూనే ఉంటాయి.

జీవని పుట్టి నాలుగేళ్ళవుతున్నా జీవనిపై ద్వేషం పోలేదు ఆయనకు. ఎందుకు ద్వేషం అంటే ఆయన సమాధానం చెప్పడు. సత్తువలేని జీవకణాల్లో కొద్ది కొద్దిగా ఊపిరి రగిలి నెమ్మదిగా అతి నెమ్మదిగా నాలుగేళ్ళకు అడుగులు వేయడం నేర్చుకొంది జీవని. అది పోరాటం. వెదురు బొంగు వేణువుగా కావడానికి పడిన శ్రమ. లేశమైనా వెలుగు సోకని అంధకారంలో పడుతూ లేస్తూ చేస్తున్న ప్రయాణం. ఈ అద్భుతమైన జీవపోరాటానికి స్పందించలేని బండ మనిషి ఆయన. తన కోసం కాక లోకం కోసం బ్రతికే


# కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి.,

## మచిలీపట్నం.

నెం. 1422

కృష్ణాజిల్లాలో రైతాంగం, చేనేతపనివారు, ఉద్యోగులు, బలహీనవర్గములవారు పరపతి పొందుతున్న బృహత్తర సహకార సంస్థ.

1. డిపాజిట్లపై ఇతర బ్యాంకులకన్న 1/2% అధిక వడ్డీని పొందండి.
2. డిపాజిట్లపై ఇన్సూరెన్సు రక్షణ కల్పించబడినది. ఇన్సూరెన్సు కార్పొరేషన్‌వారి పరిమితులకు లోబడి.
3. రిటైర్ అయిన ఉద్యోగులకు, రిటైర్ కాబోయేవారికి, వ్యవసాయదారులకు, వ్యాపారస్తులకు మరియు ఇతరులకు ఎన్నో ఆకర్షణీయమైన పథకాలు కలవు.

రేపటి కోసం నేడు పొదుపు చేయండి!

మరియు ఆడిట్ క్లాసిఫికేషనులో 'ఎ' క్లాసు పొందిన బ్యాంకు

సేవింగ్స్ అకౌంటుపై 5 1/2%, కరెంటు అకౌంటుపై 1/2% వడ్డీ లభించును.

డిపాజిట్లపై అమలులోవున్న వడ్డీ రేట్లు:

| | | | |
|---|---|---|---|
| 1) 46 రోజుల నుండి 1 సం.లోపు | 9 1/2% | 3) 2 సంవత్సరములు పైబడి 3 సం.ల లోపు | 11 1/2% |
| 2) 1 సం. నుండి 2 సం. లోపు | 10 1/2% | 4) 3 సం.ములు ఆ పైబడి | 13 1/2% |

* కృష్ణా జిల్లాలో 49 బ్రాంచీలు కలవు. *

వివరములకు సమీపమునందు గల మా బ్రాంచి మేనేజరును సంప్రదించండి.

రాజీవ్ శర్మ ఐ.ఎ.ఎస్.,
కలెక్టరు, చైర్మన్.

గారపాటి గంగారావు డి.సి.ఆర్.ఎస్., ఐ.డి.ఎ.సి.ఎ. (జపాన్)
జనరల్ మేనేజరు.




మనిషి. 'పిచ్చిదాని తండ్రి' అనిపించుకోవాల్సి వచ్చిందని కాబోలు ద్వేషం? మంచివాన్ని కాలేకపోయాడని కాబోలు ద్వేషం? అతని ద్వేషం ఒక్కోసారి జుగుప్సను కలిగిస్తుంది. నేను మనిషితో కాక ఐదున్నర అడుగుల ఎత్తున్న మృగంతో కాపురం చేస్తున్నానేమో అని భావన కలుగుతుంది. ఒకే మూరు క్రింద వుంటూనే జీవని, ఆయన అపరిచితుల్లా గడుపుతున్నారు.

కొద్దిగా అడుగులు వేయడం వచ్చిన తరువాత జీవని కళ్ళలో అపూర్వమైన తేజస్సు కనిపిస్తోంది. ప్రపంచాన్ని పాదాల దగ్గరకు తెచ్చుకున్నాననే తృప్తి ఏమో? ఒక ఉదయం బయట వరండాలో మిత్రులతో బాతాఖానీ చేస్తున్నారాయన. హాలులో ఆడుకుంటున్న జీవని, నేను వంట గదిలో వున్న సమయంలో హాలు దాటి వరండాలోకి వెళ్ళింది. ఐదారుగురు అపరిచితుల మధ్య ఒక తెలిసిన ముఖం కనిపించి, వికసించిన ముఖంతో ఆయన దగ్గరకు వెళ్ళి ఏఏఏ... అంటూ తన ఆనందాన్ని తెలిపింది. ఆయన ముఖంలో రంగులు మారాయి. ఇప్పుడే వస్తానంటూ మిత్రులతో చెప్పి జీవనిని రెక్క పుచ్చుకొని ఈడ్చుకొచ్చాడు. బెడ్‌రూమ్‌లోకి తీసు కెళ్ళి మంచంపై తోసి బెల్ట్‌తో వాతలు పడేలా కొట్టి "రాస్కెల్! హాలుదాటి వచ్చావో నీ ప్రాణం తీస్తాను!" అంటూ అరుస్తున్నాడు. నవ్వుకూ, ఏడుపుకూ తేడా తెలియని జీవని అన్ని దెబ్బలు తిని కూడా హాయిగా నవ్వుతూంది. అప్పుడే వంట గది నుంచి వచ్చి ఆ దృశ్యం చూసి నేను నిశ్చేష్టురాలైనాను. ఇతను మనిషేనా? రాగద్వేషాలకు అతీతమైన పసి కందును అంత హృదయ విదారకంగా శిక్షిస్తాడా? ఆవేశంతో అతని చొక్కా పట్టుకొని క్రోధం, ద్వేషం, జుగుప్స లను చూపులతో గుప్పిస్తూ "ఛీ! పశువా!" అని తిట్టేను. నా నోటి నుంచి అంత మాట వినడం అతనికి ఊహించని షాక్. అయినా అతనిలో మార్పు లేదు.

జీవనికి ఆకాశ మంటే యిష్టం. నీలిమబ్బు లిష్టం. ఎక్కడికో సాగిపోయే పక్షుల గుంపు లిష్టం. ఆకాశం వైపుకు చేతులు చాచి ఓ.ఓ. అంటూ పాటలు పాడుతుంది. రోడ్డుపైన ఏ చిన్న అలికిడైనా బయటికొచ్చి చూస్తుంది. పొద్దుట పూట కాన్వెంటు లకు పోయే నీలి గౌనుల చిన్నారుల హడావుడి, అల్లరి చూసి ఆనంద పడిపోతుంది. 'ఏ... ఏ...' అంటూ వాళ్ళ వైపు చూసి అరుస్తుంది. తన భాషలో వాళ్ళకు చెప్పే శుభాకాంక్షలేమో? రోడ్డుపై వరదలా ప్రవహించే కార్లు, రిక్షాలు, ఆటోలు వాటి హారన్ మోతలు చూసి కేరింతలాడుతుంది. సాయంకాలం వీధినిండా గుంపులు గుంపులుగా విడిపోయి ఆటలాడే పిల్లల వైపు క్యూరియాసిటీతో చూస్తుంది. గేటు దగ్గర నిలబడి బయట ఆటలాడుకునే పిల్లలవైపు చేతులూపుతుంది. ఆటల లోని మాధుర్యాన్ని తనకూ పంచమని అభ్యర్థనా పూర్వకంగా చూస్తుంది. ఆ అమాయకపు అభ్యర్థనకు అతి తీవ్రమైన రెస్పాన్స్ ఇస్తారా పిల్లలు. "ఏయ్ పిచ్చీ!" "పిచ్చి జీవనీ" అంటూ గేలిచేస్తారు. కళ్ళు పెద్దవి చేసి నాలుక బయట పెట్టి 'ఏయ్!' అంటూ భయపెడతారు. వాళ్ళెంత రెచ్చి పోయినా జీవని బాలక్రీస్తులా చిరునవ్వుల్ని చిందిస్తుంది. నేను బయటకు రావడం చూసి పిల్లగుంపు దూరంగా పారిపోతారు. చిన్న బుచ్చుకొన్న ముఖంతో జీవని నన్ను వెంబడిస్తుంది లోపలికి.


సాధారణంగా జీవనిని ఒంటరిగా వుంచడం జరగదు. తప్పనిసరిగా బయటకు వెళ్ళవలసి వస్తే గేటు తాళం వేసి వెడుతుంటాను. ఒక సాయంకాలం బజారు కెళ్ళి వస్తున్నాను. ఇల్లు చేరే సరికి గేటు తెరిచి వుంది. తాళం పగుల గొట్టబడి వుంది. భయంతో కొయ్యబారిపోయాను. వణుకుతున్న పాదాల్తో లోపలికి అడుగు పెట్టాను. అక్కడ అపురూపమైన దృశ్యం. పది మంది పిల్లలు ఒక చోట చేరి బొమ్మలతో ఆడుకుంటున్నారు. వాళ్ళ మధ్య జీవని వుంది. అది పెళ్ళి ఆట కాబోలు. జీవని చేతిలో పెళ్ళికూతురు బొమ్మ. ఇంకో పాప చేతిలో పెళ్ళి కొడుకు బొమ్మ. మరో చోట చిన్న చిన్న పిడతలతో విందు భోజనం తయారవుతూంది. ఆనందం, అరుపులు, కోలాహలం, చప్పట్లు, ఆ తోట, ఆ పరిసరాలు అదంతా దేవతల రాజ్యంలా వుంది. పసిపిల్లల ప్రపంచంలో నెగెటివ్ థింకింగ్ వుండదు. అందుకే ముందు గేలి చేసినా తరువాత సాదరంగా తమ బాహువుల్లోకి తీసుకున్నారు.

**   **   **

"ఈ పిల్లకు చదువెందుకు? బ్రతకడానికి అవసరమైన టెక్నిక్కులు, ఇంటి పనులు నేర్పండి. అ ఆ ఇ రాయమంటే ఆకాశాన్ని, మబ్బుల్ని గీస్తుంది. ఏబిసిడిలు రాయమంటే చెట్లనీ, ఎగిరే పక్షుల్ని గీస్తుంది. ఇది బళ్ళో చేరి సంవత్సరం దాటుతోంది. ఇంతవరకూ వర్ణమాల రాలేదు. ఇంతింత సిలబస్‌లను ఇది చదివేనా? ఈ తరగతుల్ని గట్టెక్కేనా? ఈ లెక్కన ఇది ఫస్ట్ క్లాస్ లోనే రెండు మూడేళ్ళు వుండాల్సి వస్తుంది." జీవని గురించి తన క్లాస్ టీచర్ కంప్లైంటు.

"ఎంత నేర్చుకుంది అని కాక, నేర్చుకోడానికి ఎంత పెనుగులాడుతుందో గమనించండి! స్లో గానే అయినా దాని బ్రెయిన్ ఫీడింగ్ తీసుకొంటుంది. అదో పాజిటివ్ సైన్. వందల కొద్దీ పిల్లలకు మీ చేతుల మీదుగా ప్రైమరీ ఎడ్యుకేషన్ ఇచ్చి వుంటారు. కానీ జీవని లాంటి పాప మీకు తటస్థపడి వుండదు. జీవనిని ఒక చాలెంజిగా తీసుకోండి. మీలోని టీచర్‌కి, మీరు నేర్చుకున్న టీచింగ్ సైకాలజీకి కూడ. ఒక్క జీవనికి చదువు నేర్పితే 'వీళ్ళకు చదువేమిటి? ఇంట్లో ఓ మూలన పడి వుంటారు ఇంత ముద్ద వేస్తే!' అనే పెసిమిస్టులకు బుద్ధి చెప్పినట్టువుతుంది. మనం సామాజికంగా వెనక బడిన వాళ్ళకు ప్రత్యేక శిక్షణ యిచ్చి, కోడి పిల్లల్ని రెక్కల చాటున పొదువుకుని పెంచుకొన్నట్టుగా పెంచుతున్నాము. ఎందుకు? ఈ విజ్ఞానం, నాగరికత, ఆధునిక జీవితంలోని మాధుర్యం అందరికీ సమంగా పంచుదామనే కదా! అలాగే మానసికంగా వెనుకబడ్డ పిల్లల్ని కూడా ఓపికతో అనురాగంతో ముందుకు నడిపిద్దాం. జీవని తల్లిగా కాదు. ఒక ఆధునిక మహిళగా రిక్వెస్టు చేస్తున్నాను. ప్లీజ్ టీచర్! జీవని స్పెషల్ చైల్డ్. తనకి స్పెషల్ ట్రీట్‌మెంట్ కావాలి. ఇంటి పనులు నేర్పితే చాలదా అంటూ మీరే దానిని నిరుత్సాహ పరచకండి." కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా ఉద్వేగంగా నేను చెప్పిన మాటలకు టీచర్ బాగా మూవ్ అయినారు.

"ఓగాడ్! మీరింత హర్ట్ అవుతారను కోలేదు. ఐ లవ్ జీవని! ఈ స్కూల్లో చాలామంది జీవని అభిమానుల్లో నేను ఒకదాన్ని. ఎవరైనా దాన్ని టీజ్ చేస్తే వాళ్ళ దగ్గరి కెళ్ళి, వాళ్ళ చేతిని ముద్దు పెట్టుకొని చిరునవ్వులు చిందిస్తుంది. ఇంక వారు దాన్ని ఇష్టపడకుండాఎట్లుంటారు? మొదటి రోజు క్యూరియాసిటీ, రెండో రోజు టీజింగ్, మూడో రోజు లవ్ ఎఫైర్. ఇదో దీని అభిమానుల అనుభవాల క్రోనాలజీ. డోంట్ వర్రీ! దాన్ని స్కూలు నుంచి పంపివేయను. మనకు అర్థంకాని పొటెన్షియల్స్ దానిలో నిక్షిప్తమయి వున్నాయి. వాటిని ట్రేస్



# దాంపత్యం

ఇద్దరం ఎవరి కవచాలలో వాళ్ళం
భద్రంగా ఇరుక్కుని —
ఎలాంటి చూపూ చొరబడని
ఎలాంటి పిలుపూ వినబడని
ఇనుప గోడలు మన మధ్యలో!
ఏ రాగానికీ చలించక
ఏ స్పర్శకూ జ్వలించక
చిలక్కొయ్యకు తగిలించిన
లుంగీ చీరల్లా
డబల్ కాట్ ఫోమ్ పరుపులపై
మనల్ని మనం వేలాడదీసుకున్నప్పుడు
ఆదర్శ దంపతులారా — మీరు
వేరువకాక తప్పదనే
సామాజిక పెనుపాముల బుసలకు
ఉలిక్కిపడి పెనవేసుకుంటాం.
బుసల భయం మనల్ని కలిపినప్పుడు
ఏ అణువో మండి
ఏ అసంకల్పిత చర్యలో రేగి
ఏ నరాలో కదలబారి
ఇక తప్పనిసరై
ఇద్దరం కలిసే విడివిడిగా
స్వయం తృప్తి సాధిస్తాం!

ఒకరి కొకరం వస్తువులమైనప్పుడు
ఒకరి కొకరం ఆస్తులమైనప్పుడు
ఇతరుల దురాక్రమణ నుంచి
ఆస్తుల సంరక్షణే
జీవితాలకు ఏకైక లక్ష్యమైనప్పుడు
ఒకరి కొకరం అక్కర్లేని మనం
మరెవరికీ చెందకుండా
లక్షవత్తుల సామాజిక రక్షణా యజ్ఞం
నిరంతరం సాగుతూనే వుంటుంది
ఆ రక్షణలో ఆ భద్రతలో
మనం శవాలమైతేనేం
కవచాలు పవిత్రాలే గదా
నీతిభూతమయాలే గదా
మన జన్మకీ తృప్తి చాలు గదా!

— ఓల్గా

వెయ్యడానికి ప్రయత్నిస్తున్నాం. మణిభూషణ్ అని కొత్త టీచర్. పిల్లలన్నా పెయింటింగ్స్ అన్నా యిష్టం. జీవని బాధ్యత ఆమెకు అప్పగిస్తున్నాం." ఓదార్చు తున్నట్టుగా చెప్పింది ఆమె.

వయస్సు పెరిగే కొద్దీ జీవనిలో అనూహ్యమైన మార్పులొస్తున్నాయి. కళ్ళలో మెలాంకలీ పోయి ఆలోచన స్థిరపడుతూంది. వెకిలి నవ్వు బదులు ముచ్చట గొలిపే స్నిగ్ధహాసం. ఇదివరకు కష్టం మీద మాటల్ని కూడబలుక్కుని చెప్పేది. అమ్మ అనడానికి అర నిమిషం పట్టేది. ఇప్పుడు వెంటనేరెస్పాండ్ అవుతుంది. అయితే రోజు మొత్తం మీద జీవని మాట్లాడే మాటలు పది, పదిహేనుకు మించవు. మొదటి తరగతి రెండేళ్ళు చదివింది. అయినా అ ఆలు పూర్తిగా రాలేదు. క్లాస్ రూమ్‌లో టీచర్ని, మిగిలిన పిల్లల్ని వదిలి హఠాత్తుగా తనదైన ఏకాంత ప్రపంచంలోకి పోతుంది. ఒక భయంకరమైన నిశ్శబ్దాన్ని మన ముఖంపై విసిరి తనలోకి తాను ముడుచుకుపోతుంది."అమ్మా! ఐ లవ్‌యు!" అనే మాటల్ని ఎంతో కష్టపడి నేర్చుకొంది. ఇంటి దగ్గర ఆ మాటల్నే పదే పదే గొణుగుతూ వుంటుంది.

ఆ రోజు ఆదివారం. ఆ పేర ఆకాశం కూడా హోలిడే మూడ్‌లో వుంది. తూర్పున సూర్యనేత్రం ఇంకా తెరుచుకోలేదు. డిసెంబర్ మాసపు చలి గాలులు, గుర్తొచ్చీ గుర్తురాని బాల్యపు జ్ఞాపకాల్లా. జీవని ఇంకా నిద్ర లేవలేదు. ఎదురు చూడని అతిథిలా కాలింగ్ బెల్ మోగింది. తలుపు తీస్తే, జీవని స్కూల్ హెడ్మిస్ట్రెస్, క్లాస్ టీచర్ మాలినీ రావు, జీవని ఆర్ట్ టీచర్ మణిభూషణ్; ఆహ్లాదకరమైన చిరునవ్వుల్తో చేతిలో బొకేతో ప్రత్యక్షమయ్యారు. ఆశ్చర్యం, ఉద్వేగం, "కంగ్రాచ్యులేషన్స్! జీవని పెయింటింగ్‌కి అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. 'అమ్మ' అనే తన పెయింటింగ్‌కి సోవియట్ లాండ్ చిల్డ్రెన్స్ పెయింటింగ్స్ అవార్డు వచ్చింది. మొత్తం సౌతిండియాలో ఒక్కరికే వచ్చింది. అది మన జీవనికే! ఈ శుభాకాంక్షలు మీకు. మీ వ్యక్తిగత విజయం. భూమిపై భగవంతుడి ప్రతినిధి అమ్మ అంటారు. అది మీ విషయంలో పూర్తి నిజం. దేవుడు జీవనితో మెదడునీ జ్ఞానాన్నీ పొదగడం మరిచి పోతే అయ్యో అని నిరాశ పడక, చలనం లేని తన నాడీకణాలను ప్రేమతో రగిలించి జీవన ప్రపంచంలోకి తెచ్చారు. కరుణలేని లోకం, సినిక్ అయిన భర్త అయినా మీరు వెనుకంజ వెయ్యలేదు. ఇన్నాళ్ళ శ్రమ, పోరాటం తరువాత మీకో చిన్న రివార్డు ఇది. జీవని ప్రపంచ చిత్రకళను రిప్రజెంట్ చేస్తున్న నూరు మందిలో ఒకతి" అన్నారు మాలినీ రావు.

సిగ్గుతో అదుపు తప్పిన ఆనందంతో కళ్ళలో నీళ్ళు చిమ్మిల్లినాయి. ఈ హడావుడిలో జీవని నిద్ర లేచింది. లోపలికి వెళ్ళి వాళ్ళ కోసం కాఫీ తయారు చేసుకొచ్చే లోపల జీవని తన పెయింటింగ్ టీచర్ కౌగిలిలోని వెచ్చదనాన్ని అనుభవిస్తోంది. ఈ ఆనందోత్సాహాన్ని మౌనంగా గమనిస్తున్నాయి రెండు కళ్ళు పక్క గదిలోంచి. అవి శ్రీవారి కళ్ళు. "జనవరి పదిన మాస్కో ప్రయాణం. రేపే పాస్‌పోర్టు కోసం అప్లై చెయ్యండి!" అని చెప్పి సెలవు తీసుకున్నారు వాళ్ళు. "కంగ్రాట్సు డియర్!" ఏడేళ్ళలో తండ్రి నోట వచ్చిన ఒకే ఒక్క మాటకు ఎప్పటి లాగే సిలువపై క్రీస్తు ముఖంతో చిరునవ్వుల థాంక్స్ చెప్పింది జీవని.

మంగళవారం రాత్రి టీవీలో జీవనితో ఇంటర్వ్యూ. స్కూల్లో రికార్డు చేసినట్టున్నారు. శ్రీవారు హడావుడి చేస్తున్నారు. స్నేహితులను, కొలీగ్స్‌ను ఇంటికి పిలిచారు స్వీట్సు, ఐస్‌క్రీమ్స్ పండగ వాతావరణం వచ్చింది ఇంటికి. స్నేహితులందరికీ జీవనిని చూపించి "షి యీజ్ మై ప్రైడ్ వైల్డ్"అని పరిచయం చేశారు. ఈ హడావుడిని హిపోక్రసీని మౌనంగానే గమనిస్తున్నాను. ఏడు గంటలకే టి.వి. ఆన్ చేశారు. ఎనిమిది గంటలకు ప్రోగ్రాం మొదలైంది. స్కూల్ హెడ్ మిస్ట్రెస్ జీవనిని పరిచయం చేశారు. మణి భూషణ్ జీవనితో తన అనుభవాల్ని చెప్పింది. చివరిగా జీవనితో ఇంటర్వ్యూ. ఒక భయంకరమైన నిశ్శబ్దం ఏడేళ్ళ పాపగా ఘనీభవించినట్టు జీవని. ఆనందం ఉత్సాహం లేని ముఖం. వెలగని దీపాల్లాంటి కళ్ళు. చిరునవ్వు ఎరుగని ఎడారిలా జీవని. టీవీ ఎనౌన్సర్ ఎన్ని ప్రశ్నలు వేసినా జీవని సమాధానం మౌనమే. చివరకు టీచర్లు పోరగా రెండు మూడు మాటలు గొణిగింది. "నీకు ఇష్టమైన వ్యక్తి ఎవరు?" "ఆ...ఆ...మ్మ!" "నీకు ఇన్స్పిరేషన్ ఎవరు?" "అ...అమ్మ..." "పెయింటింగ్ అంటే ఇష్టం ఎలా కలిగింది?" టీచరు వైపు చూసింది. "ఇంట్లో నీ పెయింటింగ్స్‌కి ఎవరు సహాయం చేస్తారు?" జీవని జవాబు చెప్పకుండా దిక్కులు చూస్తుంది. "బహుశా నాన్నగారు బ్రష్, కలర్స్ తెచ్చి ఎంకరేజ్ చేస్తుంటారు కదూ!" లీడ్ క్వశ్చన్ వేశారు. మళ్ళీ మౌనం. హఠాత్తుగా జీవని కళ్ళలో దిగులు పెరిగి, కళ్ళలో నీటి పొర కదలాడి "నాకు... నా...న్న...లేరు... అ...అమ్మే"అంది. టీవీ ఎదురుగా వెయ్యి చెక్కలైన ప్రతిమలా అయ్యారు శ్రీవారు. గుండె కలచి వేసి పట్టయింది. బాధలో, వేదనతో "క్షమించు జీవనీ!" అని నాలో నేనే గొణుక్కున్నాను.